క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



శ్రీవారి సన్నిధిలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే

పాలకుర్తి టౌన్: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, రాజారామ్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో తీర్థప్రసాదాలు స్వీకరించి, వేదపండితుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు పనిచేయాలి



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్/దేవరుప్పుల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ, బూత్ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు హనుమండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొడకండ్ల మండల గ్రామ పార్టీ, యూత్ అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కొడకండ్ల మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, రాజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దేవరుప్పుల మండలంలోని చిన్నమడూరులో ఎంపీటీసీ క్లస్టర్ సమావేశానికి నరేశ్ అధ్యక్షత వహించగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థలను కైవసం చేసుకోవాలని అన్నారు. ఒడపల్లి రవీందర్, రాజేష్, వంగ దశరథ, కళమ్మ, ముసిగుంపుల ఉపేంద్ర,యూత్ విభాగం మండల అధ్యక్షుడు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దేశానికి గుర్తింపు తేవాలి



కృష్ణవేణితో దాతలు, నాయకులు

జనగామ రూరల్: స్టేషన్‌ఘన్‌పూర్ మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మాచర్ల కృష్ణవేణి ఏషియన్ పారా తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించి దేశానికి గుర్తింపు తేవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు మలేషియాలో జరిగే ఏషియన్ పారా తైక్వాండో పోటీలకు ఎంపికై పాల్గొనేందుకు వెళ్తున్న కృష్ణవేణిని సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాల నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనేందుకు కృష్ణవేణి ..కౌండిన్య నార్త్ అమెరికా అసోసియేషన్ ప్రతినిధులు, దాతల సహకారంతో వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్రి అహల్య, సుమ, బాల్నే వెంకట మల్లయ్య, దూడల రాజా సంపత్, విశ్వనాథం, సిద్దులు, మడిపల్లి బాబు, చింతల శ్రీలత, పందిళ్ల కల్యాణి, కరాటే మాస్టర్, కోచ్ ఎండీ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో శ్మశాన వాటికకు వెళ్లే జాలు కాల్వపై రూ.8 లక్షలతో తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణానికి సోమవారం మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో రోడ్డు మార్గం కొట్టుకుపోవడంతో అటుగా వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యం ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ.50 లక్షల అంచనా వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారని, ప్రస్తుతం రైతులు, శ్మశాన వాటికకు వెళ్లే ప్రజలు ఇబ్బంది పడకుండా తాత్కాలిక బ్రిడ్జి పనులు చేపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దిలీప్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మోహన్, నాయకులు నాగేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు బత్తిని అశోక్‌కుమార్, నాగరాజు, శ్రీనివాసు, వీరస్వామి, రామలింగం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

దేవరుప్పుల: ప్రభుత్వ పాఠశాలలను గ్రామస్తులు బలోపేతం చేయాలని మండల విద్యాధికారి జి.కళావతి సూచించారు. సోమవారం సింగరాజుపల్లి హరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాలడుగు ప్రవీణ్ కుమార్ టై, బెల్టులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం బాస్కుల అంజయ్య, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, ప్రవీణ్ నవనీత ,శ్రీలత, రమ్య, రొడ్డ రేణుక, గోపాల్ దాస్ యాదమ్మ. మహేష్, కొంగరి రాములు, ఆయమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంటల రక్షణలో రైతుల వెతలు

- కోతులు, పందుల నుంచి కాపాడేందుకు వలల ఏర్పాటు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు



బచ్చన్నపేటలో అడవి పందులు ధ్వంసం చేసిన నారుమడి



కొడవటూర్‌లో నారు మడి చుట్టూ ఏర్పాటు చేసిన వల

బచ్చన్నపేట: ఆరుగాలాలు కష్టించి వ్యవసాయం చేస్తేనే పంటలు చేతికి వస్తున్నాయి. పంటను కోశాక తీరా లెక్కలు చూస్తే పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంటోంది. అలాంటి వ్యవసాయం చేస్తున్న అన్నదాతలు పంటలను రక్షించుకునేందుకు కోతులు, అడవి పందులు, నెమళ్లతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ బావుల వద్ద నారు పోస్తే రాత్రి వేళ అడవి పందులు, పగలు కోతుల గుంపులు ధ్వంసం చేస్తున్నాయి. చెలకల్లో విత్తనాలను విత్తితే రాత్రి వేళ నెమళ్లు వాటిని తింటున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి బెడద రైతులకు తప్పడం లేదు. ఇక కోతులను తరుముతుంటే అవి దాడి చేసి గాయపరుస్తున్నా యి. అడవి పందుల వల్ల రాత్రివేళ రైతులు కిందపడి కాళ్లు, చేతులు విరగకొట్టుకుంటున్నారు. కోతులు, పందుల బెడద నివారణకు నారు మడుల చుట్టూ వలలను కట్టినా ఉపయోగం లేకుండా పోతోందని వాపోతున్నారు. నారు లేకపోతే సేద్యం చేయడం కష్టమవుతుంది కావున సంబంధిత అధికారులు చొరవ తీసుకుని అడవి పందులు, కోతుల బెడదను నివారించాలని అన్నదాతలు కోరుతున్నారు.

నారుమడుల వద్ద కాపలా ఉంటున్నాం



వ్యవసాయ బావుల వద్ద నారు మడి పోసినప్పటి నుంచి కోతుల కోసం కాపలా ఉంటున్నాం. నాటు వేసే వరకు ఎవరో ఒకరం తప్పకుండా కాపలా ఉండాల్సిందే, లేకపోతే నారు దక్కదు. రాత్రి అడవి పందుల బెడద కూడా ఎక్కువగానే ఉంటోంది.

– దేవి ఎల్లారెడ్డి, రైతు, ఆలింపూర్

నివారణ చర్యలు చేపట్టాలి



వ్యవసాయ బావుల వద్ద కోతులు, పందుల బెడద ఎక్కువగా ఉంది. పొలంలో కొద్ది పాటి నారుమడి వేసినా కాపలా తప్పడం లేదు. దీంతో ఎటూ వెళ్లలేక పోతున్నాం. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వాటి నివారణ చర్యలను చేపట్టాలి.

– అరుకల శ్రీనివాస్, రైతు, సదాశివపేట

మోసపూరిత హామీలతో గోస పడుతున్న ప్రజలు



పార్టీలో చేరిన వారితో దయాకర్‌రావు

- మాజీ మంత్రి దయాకర్‌రావు

కొడకండ్ల: గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 420 మోసపూరిత హామీలను నమ్మి ఓటేసిన ప్రజలు గోస పడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సిందె రామోజీ అధ్యక్షతన నిర్వహించిన క్లస్టర్ స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో పెద్ద బ్లాక్‌మెయిలర్ చేతిలో ప్రభుత్వం నడువడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా కడగుట్టతండకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనునాయక్‌తో పాటు కొడకండ్ల గంగపుత్ర సంఘానికి చెందిన పలువురు నాయకులు ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సమావేశంలో మండల ఇన్‌చార్జ్ బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, పేరం రాము,వెంకటేశ్వర్‌రావు, జక్కుల విజయమ్మ, వెంకటనారాయణ, ఆసీఫ్, షన్నా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలి

జనగామ రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని సిద్దెంకి గ్రామ క్లస్టర్ ఇన్‌చార్జ్ ముస్త్యాల దయాకర్, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ పోకల జమునలింగయ్య అన్నారు. గ్రామంలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

నిరుపేదలకు సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కొమ్మూరి

జనగామ: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ నిరుపేద ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఇంటి నిర్మాణం కోసం గతంలో ఇచ్చిన హామీ మేరకు కాలనీకి వెళ్లి మర్రికుక్కల రామచంద్రంకు రూ.20వేలు, అవేటి జయమ్మకు రూ.50వేల సాయం అందించి కొమ్మూరి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, నాయకులు గాదెపక రామచంద్రం, వంగాల కళ్యాణి, బొట్ల శ్రీనివాస్, వంగాల మల్లారెడ్డి, ఇందిర, బక్క శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి

రఘునాథపల్లి: దివ్యాంగులకు రూ 6 వేలు, వృద్ధులు, వితంతువులకు చేయూత పెన్షన్లు రూ 4 వేలకు పెంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో మాజీ ఉప సర్పంచ్ గంపల కుమార్ ఆధ్వర్యంలో దివ్యాంగులు, చేయూత పెన్షన్ దారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్లు అందించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుర్రం నవీన్ డిమాండ్ చేశారు. ఇప్పగూడెంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల చైతన్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో జరిగే సింహగర్జన సభను విజయవంతం చేసేదిశగా మంగళవారం జిల్లా కేంద్రంలో దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారుల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. మంద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిలు నిర్మించాలి

జనగామ రూరల్: మండలంలోని గానుగుపహడ్, చీటకోడూర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేసి వివిధ గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కర్నాకర్, ప్రధాన కార్యదర్శి ఇరుగు సిద్దులు కోరారు. బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని సోమవారం కలెక్టరేట్ వద్ద ఎదుట ప్రజలతో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా దీక్షలను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి ప్రారంభించగా కర్నాకర్, సిద్దులు మాట్లాడారు. యాదగిరి, శ్యామ్, పి. చిరంజీవి, శ్రీనివాస్, పద్మ బాలస్వామి పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వ్యాధుల నివారణ సులభం

- ప్రోగ్రాం అధికారి శ్యాం కుమార్



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

నర్మెట: జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధుల నివారణ సాధ్యమేనని ప్రోగ్రాం ఆఫీసర్ శ్యాం కుమార్, మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ అన్నారు. గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో సోమవారం టీబీ ముక్త్ భారత్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో వారు సుమారు 50 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీతో పాటు పలు సూచనలు చేశారు. బీపీ, షుగర్, టీబీ, హెచ్‌ఐవీ, హెపటైటీస్ (బీ, సీ,), సుఖవ్యాధులకు సకాలంలో పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని, డాక్టర్ల సూచనలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీఎల్‌ఎస్ విశ్వనాథ్, ఎస్టీఎస్ చంద్రారెడ్డి, కౌన్సిలర్ భిక్షమయ్య, సూపర్‌వైజర్స్ ఆర్‌ఎం భాగ్య, పద్మావతి, హెచ్‌ఏ వేణు, ఏఎన్‌ఎంలు కుల్సుం సుల్తానా బేగం, గాదెర కరుణ, ఆశ కార్యకర్తలులు చంద్రకళ, మంగ, శ్యామల, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కాల్వల్లో నాచు, తుంగ తొలగింపునకు చర్యలు



నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న రాంబాబు, అధికారులు

రఘునాథపల్లి: బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి మేకలగట్టు, మంగళిబండతండాలకు వచ్చే కెనాల్‌లో పేరుకుపోయిన నాచు, తుంగను తొలగించి సాఫీగా చెరువులు నీటితో నిండేలా చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు సోమవారం డీఈ శ్రవణ్‌కుమార్, ఏఈ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి బొమ్మకూరు రిజర్వాయర్‌ను సందర్శించి మల్లన్నగండి నుంచి వచ్చే పంపింగ్‌ను ఆయన పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కెనాల్‌లో పెరిగిన నాచు, తుంగ సమస్యను ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి వాటిని తొలగించనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, కొంకీస్ ప్రకాష్‌రెడ్డి, నారగోని కుమార్, తూడి మల్లారెడ్డి, బాల్‌రెడ్డి ఉన్నారు.

‘కేసీఆర్ పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి’



నర్మెట: భూమి పూజలో నాయకులు



జనగామ: భూమిపూజలో భూలక్ష్మినాగరాజు

నర్మెట: కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధికి నోచుకుందని బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు నక్కల రవి, మాజీ సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్ రెడ్డి కోటాలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ నిర్మాణానికి సోమవారం వారు భూమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని, కార్యకర్తలు ఆదిశగా సమన్వయతో సైనికుల్లా పనిచేయాలని కోరారు. వెలంగిణి, సుధర్శన్, మల్లేష్, విజయ్, సురేష్ పాల్గొన్నారు.

భూమిపూజ

జనగామ: పట్టణంలోని 12వ వార్డు వీవర్స్ కాలనీకి చెందిన లబ్ధిదారులు కాముని ఉమ, రచ్చ వరలక్ష్మి, కర్రె ఉమ, శ్రీరాం, ధనలక్ష్మి, బిర్రు భవానిలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మాజీ కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మి నాగరాజు భూమిపూజ చేశారు. సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు భూమిపూజ చేసి మాట్లాడారు. చిదురాల గణేష్, గుర్రం ఉపేందర్, బిట్ల శంకర్, బేతి వెంకటేశ్వర్లు, రచ్చ శివ, కాముని వేణు, ఎనగందుల యాదగిరి, కాముని నర్సింహులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్: పవిత్ర శ్రావణ మాసం మొదటి సోమవారం సందర్భంగా డివిజన్ కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. పూజారులు రామలింగయ్యశర్మ, శ్రీనివాస్‌శర్మ, ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకం నిర్వహించారు.

మహాదేవస్వామి ఆలయంలో..

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని శ్రీ మహాదేవ స్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి సోమవారం పురస్కరించుకొని గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వేద పండితులు పిండిపోలు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛరణాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. కూరెళ్ల వేదకుమార్, హరీష్‌కుమార్, చింతకింది కృష్ణమూర్తి, బచ్చు చిరంజీవి, లక్ష్మణ్, లింగయ్య, ఉప్పలయ్య, వినయ్‌కుమార్, మహేందర్, మహిళలు పాల్గొన్నారు.

కొడవటూరులో..

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూరుగ్రామంలోని సిద్దేశ్వరాయలంలో ఘనంగా శ్రావణ మాస పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఈఓ చిందం వంశీ, ప్రధాన పూజారి ఓం నమశివాయ, సిబ్బంది నూకల లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగం బానుప్రకాష్‌రెడ్డి, బండారి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని భాగల్లుకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చేపూరి చిరంజీవి రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట స్వేరోస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఇసురం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌ను..

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ మండల నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజేష్‌రెడ్డిని కాంగ్రెస్ జిల్లా నాయకులు, కార్యకర్తలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, నాయకులు బానోత్ రాజేష్‌నాయక్, మారపల్లి ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ దేవేందర్‌నాయక్, రాపర్తి యాకయ్య, గడ్డం రవీందర్ తదితరులు ఉన్నారు.

నోట్‌బుక్స్, డిక్షనరీల అందజేత

రఘునాథపల్లి: కోమళ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కన్నారపు ప్రవీణ్ సోమవారం నోట్‌బుక్స్, డిక్షనరీలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేసి ఔదార్యం చాటారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నతస్థానాలకు చేరుకుని తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జాన్సుందర్‌రావు, ప్రవీణ్, రాములు, నరసింహారెడ్డి, అన్నపురెడ్డి, రాములు, వెంకటేష్‌యాదవ్, కుమారస్వామి, బంధ కుమార్, యాదగిరి, కిష్టయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రతీగడపకు సంక్షేమ పథకాలు



బచ్చన్నపేట: రాష్ట్రంలోని ప్రతీగడపకు సంక్షేమ పథకాలు అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం లింగంపల్లి, పడమటికేశ్వాపూర్ గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. మల్లారెడ్డి, జంగిటి విద్యానాథ్, దయాకర్‌రెడ్డి, మసూద్, వెంకట్, ఆగయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

జనగామ రూరల్: పెంబర్తిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ మొక్కలు నాటలని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. బీజెడ్‌సీ తృతీయ సంవత్సరం చదువుతున్న రూప, రాజేశ్వరి ఇచ్చిన పీపీటీ ప్రజంటేషన్‌ను అయన అభినందించారు. ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి, ఏటీపీ ఇంద్ర జ్యోతి, నళినాక్షి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

జనగామ రూరల్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో వివిధ గ్రూపుల్లో ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న స్పాట్ అడ్మిషన్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ భోజన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం సాంప్రదాయ కోర్సులకే పరిమితం కాకుండా ఈ ఏడాది వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెట్టామన్నారు. కొడకండ్లలో మెడికల్ లాబొరేటరీ టెక్నాలజీ కోర్సులో–17 సీట్లు, లింగాలఘన్‌పూర్‌లో 20, రఘునాథపల్లిలో 17 సీట్లు ఉన్నాయన్నారు. అలాగే తరిగొప్పులలో ఫార్మా టెక్నాలజీలో 30 సీట్లు, నర్మెటలో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో 5, బచ్చన్నపేటలో 5 సీట్లు ఉన్నాయన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లకు హాజరై సీట్లు పొందాలని విద్యార్థులకు సూచించారు. కేజీబీవీల్లో ఉచిత ఐఐటీ, నీట్, నిట్ కోచింగ్, ఆత్మరక్షణ టెక్నిక్‌లు, కంప్యూటర్ శిక్షణ వంటివి నేర్పిస్తారని తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

లింగాలఘణపురం: మండల కేంద్రంలో మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ల ప్రకారం సీట్ల భర్తీ ఉంటుందని, ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

లబ్ధిదారులకు ఇబ్బంది కలిగించొద్దు

తరిగొప్పుల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బంది కలుగకుండా ఇసుక, మొరం తరలింపునకు అనుమతులు ఇవ్వాలని సింగిల్ విండో మాజీ చైర్మన్ అర్జుల సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా గోదాదేవి పుట్టిన రోజు వేడుకలు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి పుట్టిన రోజు వేడుకలను భక్తుల సమక్షంలో అంత్యంత భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం చేపట్టారు. భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సీపీఎంలో చేరిక

జఫర్‌గఢ్: కూనూర్ గ్రామానికి చెందిన రాయపురం భిక్షపతితో పాటు పలువురు నాయకులు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సమక్షంలో జిల్లా కేంద్రంలో సోమవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జాన్‌వెస్లీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చిల్పూరు: రాజవరం గ్రామానికి చెందిన నారబోయిన రాజమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు యాకూబ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 3 వేల సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు బైరగోని మల్ల్య, రంగు రవి, సుధాకర్ ఉన్నారు.

విద్యుత్ స్తంభానికి మరమ్మతు



ఎర్తింగ్ సమస్యను పరిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

జనగామ: పట్టణంలోని గుండ్లగడ్డలో ఎర్తింగ్‌తో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం వద్ద ఎన్పీడీసీఎల్ అధికారులు సోమవారం మరమ్మతు చేపట్టి నివారణ చర్యలు తీసుకున్నారు. స్తభం సమీపంలో ‘వరద నీరు–ఎర్తింగ్‌తో ఆందోళన’ శీర్షికన ఈ నెల28న సాక్షిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఏఈ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఎల్‌ఐలు సత్యనారాయణ, అనుము, ఎల్‌ఎం భిక్షపతి, ఏఎల్‌ఎం అశోక్, కట్టర్ ప్రవీణ్ మరమ్మతులు చేశారు. సాక్షి చొరవతో ఎర్తింగ్ సమస్య తీరడంతో గుండ్లగడ్డ ప్రజలు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం

పాలకుర్తి టౌన్: తెలుగు సారస్వతా పరిషత్, తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ‘పోలీసులు–సామాజిక బాధ్యత’ అనే అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనంలో మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన కవి, పోతన సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మాన్యపు భుజేందర్‌ను కవితాగానం చేశారు. దీంతో ఆయనను తెలుగు సారస్వతా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్, ఐజీ రమేష్ రెడ్డిలు ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు..

జనగామ రూరల్: ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల 2025 బ్యాచ్ విద్యార్థులను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా దాత రమేష్ కుమార్ బజాజ్ పంపిన రూ.20వేల నగదు బహుమతిని ఆయన సోదరులు గితేష్, కృష్ణ జీవన్ విద్యార్థులకు అందజేశారు. వెంకటేశ్వర్లు, లింగయ్య, దాత రమేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇచ్చిన స్థలాల ఆక్రమణ అన్యాయం



గానుగుపహాడ్‌లో ఎర్రజెండాలు పాతిన నాయకులు

జనగామ రూరల్: పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఆక్రమించుకోవడం అన్యాయమని జీఎంపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కన్నబోయిన బాలరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు దడిగ సందీప్ అన్నారు. సోమవారం ఆక్రమణకు గురవుతున్న స్థలంలో వారు ఎర్రజెండాలను పాతి మాట్లాడారు. జనగామ మండలంలోని గానుగపహాడ్‌లో 30 సంవత్సరాల క్రితం నిరుపేదల ఇంటి నిర్మాణం కోసం గ్రామానికి చెందిన కారింగుల వెంకట్రామిరెడ్డి ఎకరం 20 గుంటల భూమిని బహుమానంగా గ్రామానికి బాండ్ పేపర్‌పై రాసి ఇచ్చారు. కాగా, ప్రస్తుతం వెంకట్రామిరెడ్డి కుమారుడు రఘువీరారెడ్డి స్థానికంగా ఇల్లు నిర్మించుకుని తల్లిపేర అక్రమ పట్టా చేసుకుని, ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న నిరుపేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ భూమి ఆక్రమణకు పాల్పడటం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి అవిశెట్టి గట్టయ్య, బండి రాజుల శ్రీరాములు, గుర్రం మల్లయ్య, మాజీ సర్పంచ్ గుర్రం కుమార్, నాగేష్, గుర్రం శివాజీ, గంధమల్ల సదానందం, నర్సయ్య, శీను, మహేష్, గుర్రం గణేష్, బాధితులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



శంకర్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మద్యానికి బానిసైన కుమారుడిని తల్లి మందలించగా మనస్తాపానికి గురైన మండలంలోని రంగరాయగూడెం గ్రామానికి చెందిన మంద శంకర్(22) గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన సోమవారం జరిగింది. మృతుడి తల్లి మంద కవిత పోలీసులకు అందించిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కవితకు ఇద్దరు కుమారులు. కాగా, చిన్నకుమారుడు శంకర్ డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే మద్యానికి బానిసైన శంకర్ ప్రతిరోజూ మద్యం మత్తులో ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఈనెల 23వ తేదీన అతిగా మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లి కవిత అతడిని మందలించింది. దాంతో మనస్తాపానికి గురైన అతడు శివునిపల్లి శివారులోని లక్ష్మీవెంచర్‌కు వెళ్లి క్రిమిసంహారక గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై రంగరాయగూడేనికి చెందిన సమీప బంధువు మంద వినయ్‌కు శంకర్ ఫోన్ చేసి చెప్పాడు. విషయం తెలిసిన వెంటనే వినయ్ బైక్‌పై శివునిపల్లికి వెళ్లి అపస్మారకస్థితిలో ఉన్న శంకర్‌ను ఘన్‌పూర్ ఏరియా ఆస్పత్రికి తరలించి విషయాన్ని బాధితుడి తల్లికి సమాచారం అందించాడు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కాగా, మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వస్కుల మనీషా తెలిపారు.